పోలీసుల పర్యవేక్షణ అవసరం



ఏ ఆస్పత్రిలో అయినా వైద్య, ఆరోగ్య సిబ్బంది కోసం ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టాలి. దీని కోసం పోలీసుల పర్యవేక్షణ ఏర్పాటు చెయ్యాలి. సీసీ కెమెరాల నిఘా ఉండాలి. రోగులకు సహాయంగా ఉండే వారు, రోగులను చూడటానికి ఎంతోమంది ఆస్పత్రులకు వస్తుంటారు, వారిలో ఏ ఒక్కరైనా బాధ్యతా రహితంగా ఉంటే ప్రమాదం పొంచి ఉన్నట్టే. అత్యవసర పరిస్థితుల్లో పోలీసులు అందుబాటులో ఉండేలా గట్టి చర్యలు తీసుకోవాలి.

– డాక్టర్‌ మనోజ్‌, నరసింహనగర్‌ యూపీహెచ్‌సీ

చట్టాలు పటిష్టంగా అమలు చేయాలి



ప్రాణాపాయం నుంచి గట్టెక్కించే వైద్య సిబ్బందిపై దాడులు, హత్యాచారాలకు పాల్పడటం చాలా దారుణం. ఇటువంటి వాటికి పాల్పడే వారిని కఠినంగా శిక్షించాలి. వైద్యులు, వైద్య సిబ్బంది రక్షణ కోసం ఉన్న చట్టాలు పటిష్టంగా అమలు చేయాలి. అవసరమైతే కొత్త చట్టాలు తేవాలి. ఆస్పత్రిలో స్వేచ్ఛగా ధైర్యంగా వైద్య సేవలందించేలా ప్రతి వైద్యుడికి, నర్సింగ్‌ సిబ్బందికి రక్షణ కల్పించాలి.

– డాక్టర్‌ సుధీర్‌, విద్యుత్‌నగర్‌ యూపీహెచ్‌సీ, అక్కయ్యపాలెం

నెల రోజులుగా అంధకారంలోనే..

నెల రోజులుగా ఆ ప్రాంతం అంధకారంలోనే మగ్గుతోంది. జూలై నెలలో వర్షాలకు చెట్టు కూలి, తీగలపై పడి విద్యుత్‌ పోల్స్‌ పడిపోవడంతో మొదలైన సమస్య నేటికీ పరిష్కారం కాలేదు. ఇది జరిగింది ఎక్కడో కొండలు, గుట్టలపైనో .. శివారు ప్రాంతంలోనో కాదు. నగరం నడిమధ్యలో, జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న శ్రీరామ్‌నగర్‌లో. దీంతో చీకటి పడితే చాలు.. బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నారు జనం. బుధవారం రాత్రి కొండ చిలువ రావడంతో హడలిపోయారు.



తొలగించకుండా వదిలేసిన చెట్టు కొమ్మలు



లైట్లు ఏర్పాటు చేయని పోల్‌

- గత నెలలో విద్యుత్‌ పోల్స్‌పై కూలిన వృక్షం
- అప్పటి నుంచి చీకట్లోనే మగ్గుతున్న శ్రీరామ్‌నగర్‌
- ఫిర్యాదు చేసినా.. స్పందించని యంత్రాంగం
- బిక్కుబిక్కుమంటూ స్థానికుల జీవనం

మద్రిపాలెం: జీవీఎంసీ 53వ వార్డు పరిధి జాతీయ రహదారి ఆర్‌ అండ్‌ బీ జంక్షన్‌ వద్ద సర్వీస్‌ రోడ్డును ఆనుకుని ఉన్న శ్రీరాంనగర్‌లో చీకట్లు అలముకున్నాయి. గత నెల జూలైలో వరుసగా కురిసిన వర్షాల కారణంగా ఓ మహావృక్షం కూలి, అక్కడే ఉన్న టీ కొట్టు, పాన్‌షాపు, అలాగే ఓ కారు కూడా ధ్వంసం అయింది. ఆ వృక్షం విద్యుత్‌ తీగలపై కూడా పడడంతో నాలుగు, ఐదు చోట్ల విద్యుత్‌ స్తంభాలు పడిపోయాయి. తర్వాత సిబ్బంది విద్యుత్‌ పోల్స్‌ అయితే వేశారు గానీ సుమారు నెల రోజులు దాటినా ఇప్పటివరకు లైట్లు వేయలేదు. దీంతో రాత్రయితే చాలు.. బయటికి వెళ్లాలంటేనే భయపడుతున్నారు స్థానికులు. మందుబాబుల ఆగడాలకు హద్దే ఉండడం లేదని చెబుతున్నారు.

పాములు.. కొండచిలువలు

చీకటిలో పాములు ఇళ్లలోకి వచ్చేస్తున్నాయని శ్రీరామ్‌నగర్‌ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఓ నాగుపాము అక్కడ సంపులోకి వచ్చేసింది. దీంతో హడలిపోయిన వారు వెంటనే స్నేక్‌ క్యాచర్‌ను పిలిపించడంతో, అతను వచ్చి పామును పట్టుకున్నారు. తాజాగా మంగళవారం రాత్రి ఆ ప్రాంతంలో బైకును దొంగిలించేందుకు దుండగులు ప్రయత్నించగా నైట్‌బీట్‌ పోలీసులు చూసి పట్టుకున్నారని తెలిపారు. బుధవారం రాత్రి కురిసిన వర్షానికి మూడు అడుగుల కొండచిలువ రావడంతో స్థానికులు హడలిపోయారు. ఏ క్షణం ఏం జరుగుతుందోనన్నట్లుగా ఉందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చెట్ల కొమ్మలు ఇంకా రోడ్డుపైనే..

చెట్టు కూలిన వెంటనే అధికారులు చెట్టును తప్పించి, ప్రజల రాకపోకలకు అంతరాయం కలగకుండా పక్కకు తీసేశారు. అయితే చెట్టు కొమ్మలను మాత్రం అలానే ఉంచేశారు. దీంతో విషపురుగులు ఇళ్లల్లోకి ప్రవేశిస్తున్నాయని స్థానికులు తెలిపారు.

శాఖల మధ్య సమన్వయలోపం

విద్యుత్‌ శాఖ వారికి ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా మా పని కాదు, జీవీఎంసీ వారిదని చెబుతుండగా.. జీవీఎంసీకి ఫిర్యాదు చేస్తే మా పని కాదు విద్యుత్‌ శాఖది అంటూ దాటవేస్తున్నారు. ఎవరికి చెప్పాలో తెలియడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు పడుతుండడంతో బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నామని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, వెంటనే లైట్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



వీధిలైటు వెలగకపోవడంతో అంధకారంలోనే..



సంపులో పాము

ఎవరూ పట్టించుకోవట్లేదు

ఎన్నిసార్లు ఎవరికి ఫిర్యాదు చేసినా మా విభాగం కాదని, లేదా ఈ రోజు వస్తాం.. రేపు వస్తాం అని చెప్తున్నారే తప్ప ఇంతవరకూ ఎవరూ రాలేదు, లైట్లు వేయలేదు. చెట్టు కొమ్మలను కూడా అలాగే వదిలేశారు. రాత్రయితే చీకటిలో ఉండాల్సిన దుస్థితి. త్వరగా లైట్లు ఏర్పాటు చేయాలి.

– ఆదినారాయణ, షాపు యజమాని, శ్రీరామ్‌ నగర్‌

త్వరలోనే లైట్లు ఏర్పాటు చేస్తాం

గత నెలలో చెట్టు పడిపోవడంతో ఆ ప్రాంతంలో పోల్స్‌ పడిపోయాయి. దీనికి సంబంధించి పోల్స్‌ కొత్తవి వేశాం. కొంత మెటీరియల్‌ లేకపోవడంతో లైట్లు వేయడంలో కొంత ఆలస్యం జరిగింది. త్వరలోనే లైట్లు వేసి, పని పూర్తి చేస్తాం.

– రత్నాకర్‌, ఏఈ, జీవీఎంసీ

క్లుప్తంగా

1న మెగా రక్తదాన శిబిరం

సీతంపేట: ఉప ముఖ్యమంత్రి పవన్‌ కల్యాణ్‌ జన్మదినోత్సవాల్లో భాగంగా ఈ నెల 30 నుంచి సెప్టెంబరు 2 వరకు నగరంలోని 98 వార్డుల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు జనసేన జిల్లా అధ్యక్షుడు, దక్షిణ ఎమ్మెల్యే సీహెచ్‌.వంశీకృష్ణ శ్రీనివాస్‌యాదవ్‌ తెలిపారు. స్థానిక రాజేంద్రనగర్‌లోని పార్టీ నగర కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణ కోసం ఈ నెల 30న ఐదువేల మొక్కలు నాటుతున్నట్టు తెలిపారు. 31న బీచ్‌ క్లీనింగ్‌, సెప్టెంబరు 1న ఉదయం 7 గంటల నుంచి రాత్రి 8 వరకు జనసేన పార్టీ కార్యాలయంలో రక్తదాన శిబిరం, 2న అన్ని వార్డుల్లో అన్నదానం, వస్త్రదానం నిర్వహిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరానికి సంబంధించిన ప్రచార పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు బొలిశెట్టి సత్యనారాయణ, పసుపులేటి ఉషాకిరణ్‌, శివప్రసాద్‌రెడ్డి, అంగా ప్రశాంతి, సూర్యనారాయణ పాల్గొన్నారు.

చవితి ఉత్సవాలకు పందిరి రాట



రాట ఉత్సవంలో పాల్గొన్న కార్పొరేటర్‌ రెయ్యి వెంకటరమణ తదితరులు

మద్రిపాలెం: సెప్టెంబర్‌ 7న వినాయక చవితిని పురస్కరించుకుని శ్రీ వినాయక వెల్ఫేర్‌ యూత్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో ఉత్సవాలకు బుధవారం పందిరిరాట వేశారు. కళింగనగర్‌ వుడా క్వార్టర్స్‌ సమీపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి 51వ వార్డు కార్పొరేటర్‌ రెయ్యి వెంకటరమణ హాజరై, రాట వేశారు. కార్యక్రమంలో కళింగ నగర్‌ మహిళలు, అసోసియేషన్‌ సభ్యులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో 18 కిలోల గంజాయి స్వాధీనం



గంజాయి రవాణాదారులతో జీఆర్పీ, ఆర్పీఎఫ్‌ సిబ్బంది

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వేస్టేషన్‌లో గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ఇద్దరు యువకులను రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకుని, సుమారు 18 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గవర్నమెంట్‌ రైల్వే పోలీసులు తెలిపిన వివరాలిలా.. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్‌ సిహెచ్‌.ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఆర్పీఎఫ్‌ లైన్స్‌ ఎస్‌ఐ పి.ఆర్‌.బిషోయి తమ సిబ్బందితో కలిసి విశాఖ రైల్వేస్టేషన్‌లోని పలు ప్లాట్‌ఫారాల్లో బుధవారం తనిఖీలు చేశారు. ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లాకు చెందిన అభినాష్‌ రావత, సమీర కందిలు లగేజీల్లో సుమారు రూ.90 వేల విలువచేసే 18 కిలోల గంజాయిని గుర్తించారు. దాని సీజ్‌ చేసిన ఇద్దరినీ అదుపులోకి తీసుకున్న ఆర్పీఎఫ్‌ సిబ్బంది జీఆర్పీ ఎస్‌ఐ శాంతారామ్‌కు అప్పగించారు. ఆయన వీరిని అరెస్టు చేసి రిమాండ్‌ నిమిత్తం కోర్టులో హాజరు పరిచినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.

అబ్బురపరిచిన భక్తప్రహ్లాద నాటకం

మద్దిలపాలెం: విశాఖ మ్యూజిక్‌ అండ్‌ డ్యాన్స్‌ అకాడమీ 38వ వార్షికోత్సవంలో భాగంగా కళాభారతి వేదికగా ఐదో రోజు ప్రదర్శించిన భక్తప్రహ్లాద నృత్యరూపకం అందరినీ అబ్బురపరిచింది. డాక్టర్‌ వేదాంతం రామలింగ శాస్త్రి రూపకల్పనలో ఆయనే హిరణ్యాక్షుడిగా నటించి అందరినీ మంత్రముగ్ధులను చేశారు. ప్రహ్లాదుడిగా నిఖిత అద్భుతంగా నృత్యం చేసి అందరినీ ఆకట్టుకుంది. నాటకంలో ప్రతి ఘట్టాన్ని కూచిపూడి నృత్య రీతులతో రక్తికట్టించారు. ముఖ్య అతిథి రాగం కిషోర్‌, వీఎండీఏ అధ్యక్ష, కార్యదర్శులు ఎంఎస్‌ఎన్‌ రాజు, డాక్టర్‌ గుమ్ములూరి రాంబాబు, కోశాధికారి పైడా కృష్ణప్రసాద్‌, వేదాంతం రామలింగేశ్వరశాస్త్రిలు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

అందుబాటులోకి స్మార్ట్‌ మీటర్లు



నక్కవానిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన స్మార్ట్‌ మీటర్‌

సీతమ్మధార: విద్యుత్‌ వినియోగదారుల కనెక్షన్లకు సంబంధించి స్మార్ట్‌ మీటర్లు అందుబాటులోకి వచ్చాయి. అదానీ కంపెనీ ప్రతినిధులు ముందుగా ప్రభుత్వ సర్వీసులకు సంబంధించి స్మార్ట్‌ మీటర్లు బిగిస్తున్నారు. గుజరాత్‌ రాష్ట్రం నుంచి దిగుమతి చేసుకున్న స్మార్ట్‌ మీటర్లను ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా సింగిల్‌ ఫేజ్‌కు బిగించే మీటర్లు రూ.8 వేలు, ట్రిబుల్‌ ఫేజ్‌కు రూ.10 వేల చొప్పున చెల్లించాలని అధికారులు తెలిపారు. ముందుగా ప్రభుత్వ కార్యాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాలకు స్మార్ట్‌ మీటర్లు బిగిస్తున్నారు. విశాఖలో పైలట్‌ ప్రాజెక్టులో భాగంగా ఆశీలమెట్ట, విశాలాక్షినగర్‌ ప్రాంతాల్లో స్మార్ట్‌ మీటర్ల పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా బుధవారం ‘సాక్షి’తో సీతమ్మధార సెక్షన్‌ ఈపీడీసీఎల్‌ అసిస్టెంట్‌ ఇంజినీర్‌ సుధాకర్‌ మాట్లాడుతూ తమ సబ్‌ డివిజన్‌ సెక్షన్‌ పరిధిలోని సీతమ్మధార, మద్దిలపాలెం, హెచ్‌బీ కాలనీ ప్రాంతాల్లో ఇప్పటివరకు 200 వరకు స్మార్ట్‌ మీటర్లు బిగించామని తెలిపారు. వినియోగదారులు ప్రీపెయిడ్‌ విధానంలో మొబైల్‌ఫోన్లు మాదిరిగానే రీచార్జి చేసుకోవాల్సి ఉంటుందన్నారు. లేనిపక్షంలో విద్యుత్‌ సరఫరా నిలిచిపోతుందని స్పష్టం చేశారు. 24వ వార్డు నక్కవానిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం అదానీ కంపెనీ సిబ్బంది స్మార్ట్‌ మీటర్‌ బిగించారు. తర్వాతి దశలో కమర్షియల్‌ కనెక్షన్లకు కూడా స్మార్ట్‌ మీటర్లు బిగిస్తారు.

నేడు తెలుగు భాషా దినోత్సవం

మురళీనగర్‌: తెలుగు వ్యావహారిక భాషా పితామహుడు గిడుగు రామమూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని మురళీనగర్‌ వాకర్స్‌ పార్కులో గురువారం తెలుగు భాషా దినోత్సవం నిర్వహిస్తామని వాకర్స్‌ క్లబ్‌ అధ్యక్ష, కార్యదర్శులు పల్లా చంద్రమౌళి, పి.చెల్వారాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సాయంత్రం 6.30 గంటలకు అమరావతి విశ్వసాహితి రచయితలు, కవులు పాల్గొని సాహితీ గోష్ఠి నిర్వహిస్తారని చెప్పారు. సాహితీ ప్రియులందరూ పాల్గొనాలని వారు కోరారు.

‘పంజరంలో పక్షి’ పుస్తకావిష్కరణ

- ఘనంగా రచయిత డాక్టర్‌ రాచకొండ నరసింహశర్మ 101వ జన్మదినోత్సవం

సీతంపేట: ప్రముఖ కవి, అనువాదకుడు డాక్టర్‌ రాచకొండ నరసింహశర్మ 101వ జన్మదినోత్సవం, ఆయన రచించిన అనువాద కవితా సంపుటి ‘పంజరంలో పక్షి’ పుస్తకావిష్కరణ సభ ద్వారకానగర్‌ పౌరగ్రంథాలయంలో నిర్వహించారు. సహృదయ సాహితి, ప్రసన్నభారతి సంయుక్త నిర్వహణలో బుధవారం నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆచార్య వి.బాలమోహన్‌దాస్‌ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ వందేళ్ల వయసులోనూ రాచకొండ నరసింహశర్మకు తెలుగు భాషపై మక్కువ తగ్గలేదన్నారు. 62 ఏళ్లుగా సాగిస్తున్న ఆయన సాహితీ ప్రస్థానాన్ని కొనియాడారు. 101వ సంవత్సరంలో అడుగిడిన రాచకొండను వివిధ సాహితీసంస్థల ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ప్రసన్న భారతి సంపాదకులు కొండేపూడి సర్వేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన సభలో సాహితీ వేత్తలు డాక్టర్‌ జి. రఘురామారావు, శేఖరమంత్రి ప్రభాకర్‌, కె.జి.వేణు, సిహెచ్‌.చిన సూర్యనారాయణ పాల్గొని రాచకొండ వారి సాహితీ ప్రతిభను కొనియాడారు. కార్యక్రమంలో సూరపనేని విజయ్‌కుమార్‌, ద్విభాష్యం రాజేశ్వరరావు, ఉప్పల అప్పలరాజు, కె.వి.ఎస్‌.మూర్తి తదితరులు పాల్గొన్నారు.



రాచకొండ నరసింహశర్మను సత్కరిస్తున్న ఆచార్య బాలమోహన్‌దాస్‌

ఆకాశవాణిలో నేత్రదానంపై అవగాహన

ఆరిలోవ: అంధత్వ నివారణ సంస్థ, ప్రభుత్వ పాతీయ నేత్ర వైద్యశాల ఆధ్వర్యంలో బుధవారం ఆల్‌ ఇండియా రేడియో(ఆకాశవాణి)లో 39వ జాతీయ నేత్రదానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నేత్ర వైద్యశాల సూపరింటెండెంట్‌ డాక్టర్‌ మీనాక్షి ఆధ్వర్యంలో కార్నియా కన్సల్టెంట్‌ డాక్టర్‌ మోహన్‌ ప్రీతి ఆకాశవాణి కేంద్రంలో మాట్లాడారు. ఏవిధంగా నేత్ర దానం చేయాలి, ఎవరికి చేయాలి, నేత్రదానం ఎవరు చేయవచ్చు తదితర విషయాల గురించి ఆకాశవాణితో ద్వారా శ్రోతలకు చేరవేశారు. ఈ సందర్భంగా ఆకాశవాణి ప్రతినిధి దిలీప్‌ నేత్రదానంపై ప్రజల నుంచి వచ్చే సందేహాలను డాక్టర్‌ ప్రీతి ద్వారా తెలుసుకుని వెల్లడించారు. ఇది రేడియోలో శుక్రవారం ఉదయం 7.15 గంటలకు ఆరోగ్యమే మహా భాగ్యం కార్యక్రమంలో ప్రసారం చేయనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమాన్ని శ్రోతలు విని అవగాహన పెంచుకోవాలని సూచించారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న సీనియర్‌ సివిల్‌ జడ్జి వెంకట శేషమ్మ



చైతన్య సదస్సులో పాల్గొన్న విద్యార్థులు

మురళీనగర్‌: చట్టాల అమలుపై ప్రతి వ్యక్తి అవగాహన పెంచుకోవాలని సీనియర్‌ సివిల్‌ జడ్జి ఎం.వెంకట శేషమ్మ సూచించారు. మాదకద్రవ్యాల దుర్వినియోగం, లైంగిక వేధింపులు, ర్యాగింగ్‌ వ్యతిరేక చట్టాలపై విశాఖ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో విద్యార్థులకు నిర్వహించిన చైతన్య సదస్సులో ఆమె మాట్లాడారు. కాలేజీల్లో ర్యాంగింగ్‌కు పాల్పడడం చట్ట వ్యతిరేకమని చెప్పారు. యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. బాలికలు, మహిళలను లైంగికంగా వేధించే వారిపై కఠిన చర్యలు ఉంటాయని ఆమె పేర్కొన్నారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాల సమాచారాన్ని అందించి, వాటి నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు. విద్యా సంస్థల్లో సురక్షిత వాతావారణం కల్పించేందుకు సహకరిస్తామంటూ విద్యార్థులు, సిబ్బందితో పాలిటెక్నిక్‌ ప్రిన్సిపాల్‌ కె.నారాయణరావు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో 800 మంది విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

దంచికొట్టిన వాన



శంకరమఠం రోడ్డులో నిలిచిన వర్షపు నీటిలో ప్రయాణిస్తున్న వాహనాలు



గణేష్‌నగర్‌ రోడ్డులో కూలిన చెట్టు

సీతంపేట: ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న జనానికి బుధవారం రాత్రి ఒక్కసారిగా కురిసిన భారీ వర్షం ఉపశమనం కలిగించింది. రాత్రి ఏడు గంటల సమయంలో వాతావరణం ఒక్కసారిగా చల్లబడి, భారీ వర్షం కురవడంతో రహదారులన్నీ జలమయమయ్యాయి. వర్షపు నీరు ఏరులై రహదారులపై నుంచి పొంగి ప్రవహించింది. అకస్మాత్తుగా కురిసిన వర్షానికి వాహన చోదకులు, చిరు వ్యాపారులు ఇబ్బందులకు గురయ్యారు. శంకరమఠం రోడ్డులో భారీగా వర్షపు నీరు నిలిచిపోవడం, దానికితోడు వీధి దీపాలు వెలగక పోవడంతో వాహన చోదకులు ఇక్కట్ల పాలయ్యారు. గణేష్‌నగర్‌ రోడ్డులో చెట్టు కొమ్మ విరిగి అడ్డంగా పడింది. దీంతో సత్యం సెంటర్‌ నుంచి సీతంపేటకు వెళ్లే మార్గంలో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. చెట్టు కొమ్మ విరిగి పడిన సమయంలో జనసంచారం లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. సంబంధిత అధికారులు స్పందించి చెట్టు కొమ్మ తొలగించి రాకపోకలకు మార్గం సుగమం చేయాలని కోరుతున్నారు.

వాహన చోదకుల ఇక్కట్లు

సీతమ్మధార: సుమారు రెండు గంటల పాటు బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి సీతమ్మధార, బాలయ్యశాస్త్రి లేఅవుట్‌, రాధాకృష్ణ లేఅవుట్‌ నక్కవానిపాలెం తదితర ప్రాంతాల్లో నీరు రోడ్డుపై ఏరులా ప్రవహించింది. వాహన చోదకులు, పాదచారులు ఇక్కట్లకు గురయ్యారు. రోడ్డు పక్కన వాహనాలు నిలిపివేసి వర్షం ఆగే వరకు వేచి చూశారు. కొందరు వానలో తడుస్తూ ఇళ్లకు చేరారు.



సీతమ్మధార రోడ్డుపై వర్షపు నీరు

అథ్లెట్‌ జ్యోతికి అభినందన



అథ్లెట్‌ యర్రా జ్యోతిని అభినందిస్తున్న శ్యామలదీపిక

తాటిచెట్లపాలెం: ఇటీవల ఒలింపిక్స్‌లో పాల్గొన్న విశాఖపట్నం అథ్లెట్‌ యర్రా జ్యోతికి బీజేపీ నాయకురాలు, ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు కుమార్తె శ్యామలదీపిక అభినందనలు తెలిపారు. బుధవారం శ్యామలదీపిక కుటుంబంతో కలిసి కైలాసపురంలోని జ్యోతి నివాసానికి వెళ్లి అభినందించారు. పతకం రాకపోయినందుకు నిరాశ చెందవద్దని, మరో ప్రయత్నానికి సిద్ధంగా ఉండాలని ఆమె సూచించారు.

విద్యా రంగంలో శిఖరాగ్రాన ఏయూ

విశాఖ సిటీ: విద్యా రంగంలో శిఖరాగ్రాన ఆంధ్ర విశ్వవిద్యాలయం నిలుస్తోందని ఏయూ రిజిస్ట్రార్‌ ఆచార్య ఇ.ఎన్‌.ధనుంజయరావు పేర్కొన్నారు. ఏయూ స్కూల్‌ ఆఫ్‌ ఇంటర్నేషనల్‌ బిజినెస్‌లో బుధవారం నూతన విద్యా సంవత్సరం బీబీఏ–ఎంబీఏ తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏయూ శతాబ్ది జరుపుకోవడానికి సిద్ధమవుతోందన్నారు. ఇటువంటి ప్రతిష్టాత్మక వర్సిటీని ఎంపిక చేసుకున్న ప్రతి విద్యార్థికి అభినందనలు తెలియజేస్తున్నామన్నారు. విద్యార్థుల ఆసక్తిని గుర్తించి తదనుగుణంగా ప్రోత్సహించడం ఎంతో ప్రధానమని పేర్కొన్నారు. ఏయూ సిబ్‌లో మౌలిక వసతులను మరింత మెరుగుపరచే దిశగా కృషి చేస్తామని తెలిపారు. కేంద్రం డిప్యూటీ డైరెక్టర్‌ ఆచార్య పి.విశ్వనాథం మాట్లాడుతూ అత్యుత్తమ ప్రమాణాలతో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తామన్నారు. నూతన బ్యాచ్‌ విద్యార్థులకు ఏయూ సిబ్స్‌పై అవగాహన కల్పించారు. ఏయూ ఇంక్యుబేషన్‌ సెంటర్‌ సీఈవో రవి ఈశ్వరావు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి ఆవిష్కర్తలుగా, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే వ్యవస్థను ఏయూ కలిగి ఉందన్నారు. ఇంటర్న్‌షిప్‌లు, ఇంక్యుబేషన్‌ కేంద్రాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏయూ అలుమ్ని అసోసియేషన్‌ చైర్మన్‌ ఆచార్య ఇ.శంకరరావు, ప్లేస్‌మెంట్‌ అధికారి వి.ఆర్‌.రెడ్డి పాల్గొన్నారు.



ఏయూ రిజిస్ట్రార్‌ ధనుంజయరావుకు స్వాగతం పలుకుతున్న సిబ్‌ ప్రొఫెసర్లు

మొక్కల పెంపకం, సంరక్షణకు చర్యలు



మొక్కలు నాటే ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న ఏయూ వీసీ శశిభూషణరావు

విశాఖ సిటీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్‌ కాలేజ్‌ ప్రాంగణంలో మొక్కలు నాటే ప్రాంతాన్ని బుధవారం వీసీ జి.శశిభూషణరావు పరిశీలించారు. ఈ ప్రాంగణం చుట్టూ రక్షణ కంచె ఏర్పాటు చేయాలని సూచించారు. మొక్కలకు అవసరమైన నీటిని అందించేందుకు చేస్తున్న ఏర్పాట్లు, తదితర అంశాలపై ఇంజినీరింగ్‌ అధికారులను అడిగి తెలుసుకున్నారు. సిబ్బందికి పలు సూచనలిచ్చారు. వీసీ వెంట ఆచార్య ఎన్‌.ఎం.యుగంధర్‌ ఉన్నారు.